RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | బుధవారం | పేజీలు 4 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260 | దినపత్రిక

సంపుటి: 4 సంచిక:172 | జూలై 15, 2026 | వెల: రూ.3-00

## సింగరేణిలో భరోసా యాత్ర

కార్మికులతో కిషన్ రెడ్డి భేటీ

బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు




2లో

## వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయండి



- 2028 నాటికి వరంగల్ విమానాశ్రయం లక్ష్యం
- కాకతీయ వైభవం ప్రతిబింబించేలా నిర్మాణం
- ఎంఆర్వో, కార్గో హబ్‌ల ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

2లో




## బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభోత్సవం

పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మూడు రోజుల పాటు కార్మిక రంగంపై చర్చలు

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్-2026 మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. జూలై 14 నుంచి 16 వరకు జరిగే ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి

మిగతా 2వ పేజీలో




# సర్వే పాలిటిక్స్..!

- అంతర్గత సర్వేలు చేయిస్తున్న ప్రధాన పార్టీలు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌కు 78 సీట్లు వస్తాయన్న కేటీఆర్
- డీలిమిటేషన్ తర్వాత 182 స్థానాలకు గానూ 117 సీట్లు గెలుస్తామన్న రేవంత్
- పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ఇరు పార్టీల నంబర్ గేమ్
- సొంత పార్టీ ఎమ్మెల్యేల గ్రాఫ్‌పై సీక్రెట్ సర్వేలు
- పనిచేయని వారికి వచ్చే ఎన్నికల్లో సీట్ కట్
- పనిచేయని సిట్టింగ్‌ల స్థానంలో సైలెంట్‌గా ప్రత్యామ్నాయ నేతలకు ప్రాధాన్యత
- దూకుడు పెంచిన రెండు పార్టీల అగ్రనేతలు

2లో


## వ్యూహప్రతివ్యూహాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అంతర్గత సర్వే పాలిటిక్స్ మొదలయ్యాయి.. వచ్చే ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మైండ్ గేమ్ అస్త్రంతో రంగంలోకి దిగాయి. కాంగ్రెస్ తన పాలన, సంక్షేమ పథకాలతో ప్రజల్లో దూసుకుపోతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వ వ్యతిరేకతను ఆసరాగా చేసుకుని సర్వేల అంకెలతో క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తోంది. రాబోయే రాజకీయ యుద్ధానికి వ్యూహరచన చేస్తున్న ప్రధాన పార్టీల అధిష్ఠానాలు, ఈ సర్వేల ద్వారా కేవలం ప్రత్యర్థుల బలాబలాలనే కాదు.. సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరును కూడా క్షుణ్ణంగా మానిటర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి, అధికార కాంగ్రెస్ - ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య సాగుతున్న ఈ నంబర్ గేమ్, రాబోయే రోజుల్లో మరింత వేడి పుట్టించనున్నాయి.

## యువతిని నమ్మి మోసపోయా..

- ఆమె కుటుంబానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో అప్పుల పాలయ్యా
- హత్యలకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో



2లో

# ఈవోను కాపాడుతున్నదెవరు..?




## విచారణ పూర్తయినా చర్యలు శూన్యం

## కమిషనర్ కార్యాలయానికి నివేదిక చేరి నెలలు గడిచినా చర్యలు ఎక్కడ?

**వేద న్యూస్, వివేక్**

బాలానగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గతంలో చేసిన ఈఓపై వచ్చిన ఆరోపణల వ్యవహారంలో దేవాదాయ శాఖ తీరు పలు ప్రశ్నలకు తావిస్తోంది. అదనపు కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ జోన్ ఇన్‌చార్జి సునీత విచారణ నిర్వహించి కమిషనర్ కార్యాలయానికి నివేదిక సమర్పించినట్లు విశ్వాసనీయ సమాచారం. అయితే నివేదిక సమర్పించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడక పోవడంపై భక్తులు, స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

### అసలు కాపాడుతుంది ఎవరూ..?

నాగేశ్వర్ రావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయినా చర్యలు లేకపోవడంతో 'ఆయనను కాపాడుతున్నది ఎవరు?', 'ఎందుకు చర్యలకు ఆలస్యం అవుతోంది?' అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. శాఖలోని కొందరి అండదండల వల్లే చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

దేవాలయ నిధులు, రికార్డులు, భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశం కావడంతో విచారణ నివేదికలో అవకతవకలు తేలితే విచారణ నివేదికను బహిర్గతం చేసి, బాధ్యులపై ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అవసరమైతే సస్పెన్షన్, క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్



### వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలను

## అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయండి

- 2028 నాటికి వరంగల్ విమానాశ్రయం లక్ష్యం
- కాకతీయ వైభవం ప్రతిబింబించేలా నిర్మాణం
- ఎంఆర్వో, కార్గో హబ్‌ల ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో రెండు విమానాశ్రయాల నిర్మాణం, ఆధునిక సౌకర్యాలు, ప్రాంతీయ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి వరంగల్ విమానాశ్రయం కీలకమని సీఎం పేర్కొన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో పాటు పారిశ్రామికాభివృద్ధికి ఇది దోహదపడుతుందని వివరించారు. విమానాల మరమ్మతు కేంద్రం (ఎంఆర్వో), కార్గో హబ్, విమాన నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయిందని, వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. 2028 జూన్ 2 నాటికి విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విమానాశ్రయ రూపకల్పనలో కాకతీయ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక నమూనాలు ఉండాలని సూచించారు. దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ విమానాశ్రయంతో పాటు పౌర విమానాశ్రయం కూడా ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. రెండు విమానాశ్రయాలకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్‌లో కూడా ఎంఆర్వో, కార్గో హబ్, విమాన నిల్వ కేంద్రంతో పాటు విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు.

## యువతిని నమ్మి మోసపోయా..

- ఆమె కుటుంబానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో అప్పుల పాలయ్యా
- హత్యలకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో

**వేద న్యూస్, హైదరాబాద్**

షాబాద్‌లో జరిగిన బహుళ హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ఒక రోజు ముందు రికార్డు చేసిన సెల్ఫీ వీడియో వెలుగులోకి వచ్చింది. జూలై 10న చిత్రీకరించినట్లు చెబుతున్న ఆ వీడియోలో తన జీవితంలో ఎదురైన ఆర్థిక, వ్యక్తిగత సమస్యలపై అతడు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. యువతిని నమ్మి అన్ని విధాలుగా మోసపోయానని, ఆమె కుటుంబానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో అప్పుల పాలయ్యానని, ఆ పరిణామాల వల్ల తన కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని వీడియోలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పిల్లలకు ఇవ్వాల్సిన ఆస్తిని కూడా కోల్పోయానని, అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తి కలిగిందని, తన పరిస్థితికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణమని చెప్పినట్లు సమాచారం. అయితే వీడియోలో చేసిన ఆరోపణలు రాజ్‌కుమార్ వ్యక్తిగత వాదనలు మాత్రమేనని, వాటి నిజానిజాలను దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తూ ఆర్థిక లావాదేవీలు, ఇతర కారణాలతో పాటు వీడియో, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు దారితీసిన అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## సింగరేణిలో భరోసా యాత్ర

### కార్మికులతో కిషన్ రెడ్డి భేటీ

**వేద న్యూస్, భూపాలపల్లి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా కేటీకే–8 గనిని సందర్శించిన ఆయన సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. దేశ అభివృద్ధిలో సింగరేణి కార్మికుల కృషి ఎంతో కీలకమని ఆయన కొనియాడారు. సింగరేణి కార్మికుల అంకితభావం, కష్టపడి పనిచేసే తత్వం వల్లే దశాబ్దాలుగా దేశ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని కిషన్ రెడ్డి అన్నారు. కార్మికుల శ్రమ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పదేళ్లలో సింగరేణి కార్మికుల్లో ఆందోళన, అభద్రతా భావం పెరిగిందని ఆయన ఆరోపించారు. వరుసగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు కార్మికుల్లో విశ్వాసాన్ని దెబ్బతీశాయని విమర్శించారు. సింగరేణి వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వాలు దానిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు.

## బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

**మొదటి పేజీ తరువాయి**

సంయుక్తంగా ప్రారంభించారు. ప్రపంచ కార్మిక రంగంలో మారుతున్న పరిస్థితులు, కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు సదస్సులో చర్చించనున్నారు. పరస్పర అనుభవాలను పంచుకుంటూ ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేయనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతమైతే కార్మికుల సంక్షేమానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఇలాంటి అంతర్జాతీయ సదస్సు ఆతిథ్యం దక్కడం గర్వకారణమన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనతో పాటు కార్మిక సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సదస్సులో బ్రిక్స్ దేశాలకు చెందిన ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కార్మిక రంగ నిపుణులు పాల్గొని కార్మిక హక్కులు, సుస్థిర ఉపాధి, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.

# సర్వే పాలిటిక్స్..!

### వ్యూహప్రతివ్యూహాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ

- అంతర్గత సర్వేలు చేయిస్తున్న ప్రధాన పార్టీలు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌కు 78 సీట్లు వస్తాయన్న కేటీఆర్
- డీలిమిటేషన్ తర్వాత 182 స్థానాలకు గానూ 117 సీట్లు గెలుస్తామన్న రేవంత్
- పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ఇరు పార్టీల నంబర్ గేమ్
- సొంత పార్టీ ఎమ్మెల్యేల గ్రాఫ్‌పై సీక్రెట్ సర్వేలు
- పనిచేయని వారికి వచ్చే ఎన్నికల్లో సీట్ కట్
- పనిచేయని సిట్టింగ్‌ల స్థానంలో సైలెంట్‌గా ప్రత్యామ్నాయ నేతలకు ప్రాధాన్యత
- దూకుడు పెంచిన రెండు పార్టీల అగ్రనేతలు




**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్ర రాజకీయాలు కొంత కాలంగా వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నువ్వా–నేనా అన్నట్టు వ్యూహప్రతివ్యూహాలతో పొలిటికల్ మైండ్ గేమ్‌ను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. క్షేత్రస్థాయిలో పార్టీల బలాబలాలు ఎలా ఉన్నాయి? ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? అనే అంశాలపై ఇరు పార్టీల అగ్రనేతలు రహస్యంగా సీక్రెట్ సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సర్వేల సారాంశాన్ని ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రస్తావించడంతో తెలంగాణలో సర్వే పాలిటిక్స్ రసవత్తరంగా మారాయి. ఏయే స్థానాల్లో పార్టీ పటిష్టంగా ఉంది?, ఎక్కడెక్కడ బలహీనపడింది? అనే అంశాలపై ఇరు పార్టీల అధిష్ఠానాలకు ఇప్పటికే ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చినట్లు సమాచారం.

#### 78 సీట్లతో అంటూ కేటీఆర్

రెండు పార్టీల మధ్య నంబర్ గేమ్ ఇప్పుడు జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీకాలం ముగిసేసరికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇంటెలిజెన్స్ వర్గాలు, ప్రభుత్వ అంతర్గత సర్వేల ప్రకారమే ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్ ఏకంగా 78 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ప్రకటించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారనే వాతావరణాన్ని క్షేత్రస్థాయిలో సృష్టించడం ద్వారా.. పార్టీ ఫిరాయింపులకు గట్టిగా బ్రేక్ వేయడంతో పాటు నియోజకవర్గాల్లోని క్యాడర్‌లో సరికొత్త పొలిటికల్ ఉత్సాహాన్ని నింపాలనేది కేటీఆర్ అనుసరిస్తున్న ప్రధాన రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.

#### పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు..

వరుసగా జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడం.. అదే సమయంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు కండువాలు మార్చి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతుండటంతో గులాబీ కేడర్ కొంత కన్‌ఫ్యూజన్‌లో పడింది. ఇలాంటి క్లిష్టమైన తరుణంలో పార్టీ శ్రేణులకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ధైర్యం కల్పించడం అత్యంత అవసరమని గులాబీ లీడర్‌షిప్ భావిస్తోంది. అందుకే వచ్చేది మన ప్రభుత్వమేనని బలంగా నమ్మకం కలిగించడం కోసం కేటీఆర్ సర్వేల అస్త్రాన్ని ప్రయోగించారు. ఈ వ్యూహం ద్వారా పార్టీని వీడాలనుకునే వారిలో పునరాలోచన కలిగించడంతో పాటు, గ్రామాల్లో కేడర్ మళ్లీ యాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ వేగవంతం చేస్తున్నారు.

#### 117 సీట్లతో రేవంత్ కౌంటర్..

కేటీఆర్ సర్వే లీకులకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అంతే వ్యూహాత్మకంగా, అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం తెచ్చే డీలిమిటేషన్ బిల్లు ద్వారా నియోజకవర్గాల సంఖ్య 119 నుండి 182కి పెరుగుతుందని అంచనా వేస్తూ.. అందులో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 117 సీట్లు క్లీన్ స్వీప్ చేసి మళ్లీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఫేక్ సర్వేల ప్రచారాన్ని, మైండ్ గేమ్‌ను తిప్పికొట్టడానికి రేవంత్ రెడ్డి ఈ భారీ నంబర్ స్ట్రాటజీని తెరపైకి తెచ్చారు. దీనిద్వారా అటు ప్రతిపక్షాల నోళ్లు మూయించడంతో పాటు, ఇటు సొంత పార్టీలో అక్కడక్కడా వ్యక్తమవుతున్న అసంతృప్తిని తొక్కిపెట్టవచ్చనేది ముందస్తు వ్యూహంగా కనిపిస్తోంది.

#### ఎమ్మెల్యేల పనితీరుపై సీక్రెట్ నిఘా..

ఈ సర్వేల ఉద్దేశం కేవలం పార్టీల బలాన్ని అంచనా వేయడమే కాకుండా, సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరును కూడా గుట్టుచప్పుడు కాకుండా పసిగట్టడమేనని తెలుస్తోంది. నియోజకవర్గాల్లో ఏ ఎమ్మెల్యే ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు? ఎవరు కేవలం సోషల్ మీడియాకే పరిమితమవుతున్నారు? అనే పూర్తి రిపోర్ట్ ఇప్పటికే పార్టీ పెద్దల వద్ద సిద్ధంగా ఉంది. ప్రజల్లో వ్యతిరేకత ఉండి, నియోజకవర్గాన్ని పట్టించుకోని ఎమ్మెల్యేల ప్లేసులో ప్రత్యామ్నాయంగా వేరే నేతలకు అవకాశం ఇచ్చేలా పార్టీలు పరిశీలిస్తున్నాయి. అయితే, పాతవారిని ఇప్పుడే డిస్టర్బ్ చేయకుండా, వారు మారేందుకు సమయం ఇస్తూనే.. బ్యాక్‌గ్రౌండ్‌లో కొత్త లీడర్లను అంతర్గతంగా ఎంకరేజ్ చేస్తున్నట్లు సమాచారం. పార్టీని, కార్యకర్తలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా సీట్ కట్ అవుతుందని సర్వేల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

#### పేలుతున్న మాటల తూటాలు

ఇప్పటికే ఈ రెండు పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. వచ్చే ఎన్నికలు రెండు పార్టీలకూ అత్యంత ప్రతిష్టాత్మకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, పాలనా మార్కుతో జనాల్లోకి వెళ్లేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటుంటే.. బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సర్వేల మైలేజీతో దూసుకుపోవాలని చూస్తోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా టికెట్ల కేటాయింపు ఉంటుందన్న హెచ్చరికలు ఇరు పార్టీల లీడర్లలో గుబులు రేపుతున్నాయి.

## పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తా..

**వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోడం శివ కృష్ణ**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కోడం శివ కృష్ణ ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు, ప్రజల్లో చురుకైన పాత్రను గుర్తిస్తూ ఈ బాధ్యతలను పార్టీ అధిష్ఠానం అప్పగించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కోడెం శివ కృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోడం శివ కృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.



## వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా అత్తర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా మీర్జా ఇనాయతుల్లా బేగ్ (అత్తర్ )ను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అత్తర్ కృషి చేస్తారని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అత్తర్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలతో కలిసి సమిష్టిగా పనిచేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

వేద న్యూస్

బుధవారం జులై 15 , 2026

# పరిశుభ్రతపై ప్రత్యేక తనిఖీ

**- చైతన్యపురిలో కమిషనర్ ఆకస్మిక పర్యటన**
**- పారిశుధ్యం, మౌలిక వసతుల పరిశీలన**

**వేద న్యూస్, హైదరాబాద్:**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరూర్‌నగర్ సర్కిల్12 పరిధిలోని చైతన్యపురి వార్డులో మంగళవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. న్యూ మారుతీనగర్, ఫణిగిరి కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీల్లో పరిశుభ్రత, పౌర మౌలిక వసతులు, నిబంధనల అమలును పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్యటన సందర్భంగా రహదారులపై, పక్క ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రహదారుల అంచులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాలు, కూల్చివేతల వల్ల పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆ వ్యర్థాలను అనుమతి పొందిన చెల్లింపు సేకరణ వ్యవస్థ ద్వారా మాత్రమే అప్పగించాలని ఆస్తి యజమానులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా వ్యర్థాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వాణిజ్య అనుమతుల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు పాటించని



సంస్థలపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు వాణిజ్య అనుమతుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు చెప్పారు. ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మొక్కల కుండీలను సక్రమంగా సంరక్షించాలని, నిర్లక్ష్యంగా వదిలేసిన వాటిని తొలగించాలని ఆదేశించారు. పచ్చదనాన్ని పెంపొందించే చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రమైన, సురక్షితమైన, పచ్చదనంతో కూడిన నగరంగా మల్కాజిగిరిని తీర్చిదిద్దడమే మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ఇందుకోసం క్షేత్రస్థాయి తనిఖీలను నిరంతరం నిర్వహిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# గడువులోగా సర్ పూర్తి చేయాలి

**వేద న్యూస్, ఖమ్మం:**



**- కూసుమంచిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజక వర్గంలోని కూసు మంచి మండలంలో కొనసాగు తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, డేటా నమోదు, డిజిటలైజేషన్ పనులను పరిశీలించి అధికా రులకు పలు సూచనలు చేశారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక కుటుంబంలోని అర్హులైన సభ్యులందరి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లినవారు, మరణించిన ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించి ఈ నెల 24లోగా ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

# సింగరేణి కార్మికులతో కిషన్ రెడ్డి అల్పాహారం

**- కార్మికుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందన్న మంత్రి**



**వేద న్యూస్, భూపాలపల్లి:**

సింగరేణి భరోసా యాత్ర రెండో రోజు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేటీకే8 గనిలో సింగరేణి కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన వారితో కలిసి అల్పాహారం చేశారు. కార్మికులు చూపించిన ఆతిథ్యం తనను ఎంతో కదిలించిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధికి సింగరేణి కార్మికుల శ్రమ, అంకితభావం కీలకమని పేర్కొంటూ, వారి సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, భద్రత, గౌరవానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సింగరేణి భరోసా యాత్ర ద్వారా కార్మికులతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# గంటలోనే తప్పిపోయిన బాలుడు అప్పగింత



**- ఆలేరు పోలీసుల వేగవంతమైన స్పందన**
**- సోషల్ మీడియా సహకారంతో తల్లిదండ్రుల గుర్తింపు**

**వేద న్యూస్, యాదాద్రి భువనగిరి:**

తప్పిపోయిన ఓ బాలుడిని గంటలోపే గుర్తించి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించిన ఆలేరు పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆలేరు బస్టాండ్ పరిసరాల్లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని గుర్తించిన పోలీసులు వెంటనే పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. అయితే బాలుడు తల్లిదండ్రుల వివరాలు చెప్పలేకపోవడంతో సోషల్ మీడియా ద్వారా సమాచారం పంచి గాలింపు చేపట్టారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాలుడిని గుర్తించారు. ధ్రువీకరణ అనంతరం పోలీసులు బాలుడిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడిని క్షేమంగా తిరిగి అందించినందుకు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనలో సీఐ యాలాద్రి, ఎస్ఐ వినయ్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది వేగంగా స్పందించి బాలుడిని గుర్తించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రజల భద్రత, చిన్నారుల రక్షణకు తెలంగాణ పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని అధికారులు తెలిపారు.

# బస్తీ దవాఖానపై మంత్రి సమీక్ష

**- పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ**
**- ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి పరిశీలన**



**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ వినాయకనగర్ బస్తీ దవాఖానను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా సందర్శించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి దవాఖానలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. చికిత్స, పరీక్షలు, మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన పరీక్షలు, మందులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా రక్తంలో చక్కెర, రక్తపోటు తదితర పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్‌లోని 169 బస్తీ దవాఖానల కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. వారు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి వైద్య సేవలు, మౌలిక వసతులు, రోగుల సంఖ్య పెంపుపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాలకు భారీ సన్నాహాలు

**- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి రూ.117 కోట్లు**
**- భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలే లక్ష్యం**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- 2027 పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు**

**వేద న్యూస్, ధర్మపురి:**

2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పుష్కర ఘాట్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అన్ని పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కోట్లాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించిందని, తొలి విడతలో ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులకు రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అదనంగా రూ.50-60 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పుష్కరాలు కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి



పరిచయం చేసే అవకాశం అని మంత్రి పేర్కొన్నారు. శాశ్వత మౌలిక వసతులను అభివృద్ధి చేసి పుష్కరాల అనంతరం కూడా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని అధికారుల ను ఆదేశించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అభివృద్ధి పనుల పురోగతిని మంత్రికి వివరించారు. ట్రాఫిక్ నిర్వహణ , భద్రత, అత్యవసర సేవల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచేలా అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.

# సింగరేణికి కేంద్రం భరోసా



**- కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంది**
**- తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయింపు చారిత్రాత్మకం**
**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**
**- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు**

**వేద న్యూస్, గోదావరిఖని:**

సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డితో కలిసి గోదావరిఖని ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన రాంచందర్‌రావు, సింగరేణి కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని, కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంస్థ అభివృద్ధికి కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్న రాంచందర్‌రావు, దీనివల్ల సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతం కావడంతో పాటు కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడి వేలాది మంది కార్మిక కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా లభిస్తుందని అన్నారు. సింగరేణి అభివృద్ధితో రాష్ట్ర పారిశ్రామిక రంగానికీ ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కులు, భవిష్యత్తు కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, కార్మికుల ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ అభ్యంతరాలు

**వేద న్యూస్, హైదరాబాద్:**

**- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వినతి**
**- గడువు పొడిగించాలని డిమాండ్**
**- బీఎల్‌వోల పనితీరుపై అసంతృప్తి**



రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎస్ఐఆర్ సమన్వయ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తో పాటు పార్టీ నాయకులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు సమర్థవంతంగా పనిచేయడం లేదని, అమలులో సాంకేతికపరమైన అనేక సందేహాలు ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అందడం లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఓటర్ల నమోదు, సవరణ, వివరాల ధృవీ కరణలో పలు లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించిన నేతలు, పెండింగ్‌లో ఉన్న వినతులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు సరిపోవడం లేదని, అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేందుకు ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ మరోసారి విజ్ఞప్తి చేసింది.

వేద న్యూస్

బుధవారం జూలై 15 , 2026

# రామంతాపూర్ చెరువుకు విముక్తి

- హైడ్రా భారీ ఆక్రమణల తొలగింపు
- 2,180 గజాల భూమిని చెరువు పరిధిలోకి
- రూ.19 కోట్ల అభివృద్ధి పనులకు మార్గం సుగమం



**వేద న్యూస్, హైదరాబాద్:**

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతా పూర్ పెద్దచెరువు పరిరక్షణలో భాగంగా హైడ్రా మంగళవారం భారీ ఎత్తున ఆక్రమణలను తొలగించింది. చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణాన్ని పునరుద్ధరించే చర్యల్లో భాగంగా 2,180 గజాల ఆక్రమిత భూమిని తిరిగి చెరువు పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో చెరువు అభివృద్ధి పనులకు ప్రధాన అడ్డంకులు తొలగి నట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ పెద్దచెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణం 30 ఎకరాలు కాగా, అందులో సుమారు 16 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 12 ఎకరాల్లో శాశ్వత నిర్మాణాలు, నాలుగు ఎకరాల్లో తాత్కాలిక షెడ్లు, గుడిసెలు ఉన్నాయని వెల్లడించారు. చెరువు అభివృద్ధిలో భాగంగా నిర్మాణంలో ఉన్న 1,900 గజాల వాణిజ్య భవనాన్ని, 280 గజాల విస్తీర్ణంలోని ఆటో గ్యారేజీని హైడ్రా బృందాలు తొలగించాయి. చెరువు పరిసరాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, వర్షాకాలంలో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. చెత్త సేకరణ, కూలీ పనులతో జీవనం సాగించే కుటుంబాలకు గృహాల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్దచెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.19 కోట్లతో గట్ల బలోపేతం, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పనులు చేపట్టిందని అధికారులు తెలిపారు. నగరంలోని చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆక్రమణలపై చర్యలు కొనసాగిస్తామని, ప్రజలు కూడా సహ కరించాలని హైడ్రా అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- విద్యుత్ మౌలిక వసతులకు ఊతం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.376.25 కోట్ల విద్యుత్ పనులకు శ్రీకారం
- ఉపకేంద్రాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి



**వేద న్యూస్, గద్వాల:**

రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో రూ.376.25 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్ హెలిప్యాడ్‌కు చేరుకున్న భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించారు. తదుపరి ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ.155 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేసి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బహిరంగ సభలో మాట్లాడిన భట్టి విక్రమార్క, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేసేందుకు ఆధునిక ఉపకేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ విద్యుత్ రంగ బలోపేతంతో గ్రామీణాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. జిల్లాలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు విజయుడు, చిక్కుడు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, అనిరుద్ధ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్ అభివృద్ధిపై సమీక్ష

- జయేశ్ రంజన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమావేశం



**వేద న్యూస్, హైదరాబాద్:**

జవహర్‌నగర్‌ను పరిశుభ్రమైన, పర్యావరణ హిత ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యర్థాల నిర్వహణ, చెత్తకుప్పల శాస్త్రీయ నిర్మూలన, స్థానిక ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలపై అధికారులతో విస్తృతంగా చర్చిం చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్‌తో పాటు ఐఐటీ ముంబయి, జె-పాల్, రెయిన్‌బో హోమ్స్, ఏఆర్ఎల్ సంస్థల నిపుణులు సమావేశంలో పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లోని వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, చెత్త కుప్పల ప్రాంతం, పరిసర కాలనీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్తకుప్పలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించడం, జీవవాయువు ఉత్పత్తిని ప్రోత్సహించడం, వ్యర్థాలను పర్యావరణహితంగా శుద్ధి చేయడం, చెత్తను మూలం వద్దే వేరు చేసి సేకరించే వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులు నిర్ణయించారు. కాలుష్యం, దుర్వాసన నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక వసతులు, విద్యా సౌకర్యాల విస్తరణపై కూడా సమావేశంలో చర్చించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల నిర్వహణను సమర్థవం తంగా అమలు చేసి జవహర్‌నగర్‌ను పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన సుస్థిర అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దాలని జయేశ్ రంజన్ అధికారులను ఆదేశించారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు, పతకాల పంపిణీ

**వేద న్యూస్, హైదరాబాద్:**

గత ఏప్రిల్ 26న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 1,212 మంది విద్యార్థులు వరుసగా 20 నిమిషాల పాటు బేసిక్ కరాటే ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఈ రికార్డులో భాగమైన విద్యార్థులకు శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో సర్టిఫికెట్లు, పతకాలు ఘనంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నేవీన్ నాయక్ కరాటే అకాడమీకి చెందిన నిగ్న సింహారెడ్డి, యశ్విత, చందన, దినేశ్వర్ అనే నలుగురు విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వాములై సర్టిఫికెట్లు, పతకాలు అందుకున్నారు. కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ కల్మేశ్వర్ షింగేనవర్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. లచిరాం నాయక్ (తిరుపతి) గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రధాన కోచ్ నేవీన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కల్మేశ్వర్ షింగేనవర్ మాట్లాడుతూ, గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థుల క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలను అభినందించారు. అలాగే పిల్లల్లోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ కామాక్షిపురం ప్లేగ్రౌండ్,రామంతపూర్‌లో ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్న కోచ్ నేవీన్ నాయక్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొంటూ, మరింత మంది విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద తెలంగాణ విద్యార్థి సంఘాలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, బీసీ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొత్త విద్యా సంవత్సరంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గత విధానంలోనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులపై రికవరీ చర్యలు చేపట్టడం అన్యాయమని, ఇది వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదని పేర్కొన్న ఆయన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకుని బకాయిలను విడుదల చేయడంతో పాటు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, బీసీ జేఏసీ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్యూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- 20వ తేదీ పథకం ప్రారంభం
- దశలవారీగా లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం
- పట్టణ పేదలకు సొంతింటి కల సాకారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నియోజకవర్గాల వారీగా పైలట్ ప్రాజెక్టు అమలు



**వేద న్యూస్, హైదరాబాద్:**

పట్టణ పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు క్యూర్ పరిధిలో దశలవారీగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఈ పథకానికి పరిపాలనా అనుమతులు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు. సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 20న ఇందిరమ్మ ఎల్ఐజీ గృహ పథకాన్ని అధికారికంగా ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులతో కలిసి మార్గదర్శకాలు, అర్హతలు, దరఖాస్తుల విధానం, టెండర్ల ప్రక్రియను ప్రకటించనున్నట్లు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న మంత్రి, తొలి దశలో ప్రతి నియోజకవర్గంలో 500 నుంచి అవసరాన్ని బట్టి వెయ్యి ఇళ్ల వరకు పైలట్ ప్రాజెక్టుగా నిర్మించనున్నట్లు తెలిపారు. పట్టణ పేదలకు ఉపాధి, విద్య, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ప్రభుత్వ భూములపై ఇళ్ల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నగరానికి దూరంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించిన మంత్రి, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గృహ నిర్మాణాన్ని చేపడుతోందన్నారు. లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా శాశ్వత ఆర్థిక భద్రత కల్పిస్తామని తెలిపారు. క్యూర్ పరిధిలో అవసరమైన ప్రభుత్వ భూములను ఇప్పటికే గుర్తించి హౌసింగ్ శాఖ ఆధీనంలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నమూనా, అంతస్తుల సంఖ్య, విస్తీర్ణం వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్
- మంత్రులు భట్టి, ఉత్తమ్ పర్యటనపై సమీక్ష
- సాగునీటి ప్రాజెక్టుల పర్యటనకు సన్నాహాలు



**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం:**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టుల సందర్శనతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశ ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్, అనంతరం అమ్మగారిపల్లిలో సమావేశ వేదికను సందర్శించి ఏర్పాట్లు, అతిథుల సౌకర్యాలు, భద్రతా చర్యలను సమీక్షించారు. ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని సూచించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మీడియా సౌకర్యాలు, ప్రజాప్రతినిధుల కూర్చునే ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులు జిల్లాలో సాగునీటి విస్తరణకు కీలకమని పేర్కొన్న కలెక్టర్, సమీక్ష సమావేశానికి అవసరమైన అన్ని వివరాలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో రెవెన్యూ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, పోలీసు, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలకు వేగంగా మోడల్ సోలార్

- ఈ నెలాఖరులోగా 37 గ్రామాల్లో పనులు పూర్తి
- రెడ్‌కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి
- నెట్ మీటరింగ్, గ్రిడ్ సింక్రనైజేషన్‌పై దృష్టి



వేద న్యూస్, హనుమకొండ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 37 గ్రామాల్లో చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రెడ్‌కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని ఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పనుల పురోగతిని సమీక్షించారు. టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, పది సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లు, రెడ్‌కో అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. మోడల్ సోలార్ గ్రామాల పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముషారఫ్ ఫరూఖి సూచించారు. గ్రిడ్ సింక్రనైజేషన్, నెట్ మీటరింగ్ ప్రక్రియలను జాప్యం లేకుండా పూర్తి చేయాలని, సాంకేతిక, పరిపాలనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. త్వరలో ఖమ్మం జిల్లా బోనకల్లు మోడల్ సోలార్ గ్రామాన్ని సందర్శించనున్నట్లు వెల్లడించిన ఆయన, అప్పటికి అన్ని పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన నెట్ మీటర్లు అందుబాటులో ఉన్నాయని, వాటి ఏర్పాటులో జాప్యం ఉండరాదన్నారు. మోడల్ సోలార్ గ్రామాల పనులు పూర్తైన తర్వాత వ్యవసాయ మోటార్లకు సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్టులు) వి. మోహన్ రావు, చీఫ్ ఇంజినీర్లు, జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073